బ్రహ్మకుమారీస్‌ సేవలు అభినందనీయం


డిప్యూటీ మేయర్‌ను ఆహ్వానిస్తున్న బ్రహ్మకుమారీలు

లాలాపేట: నేటి సమాజంలో మాయమైపోతున్న మానవ విలువల పరిరక్షణకు బ్రహ్మకుమారీస్‌ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయం అని డిప్యూటీ మేయర్‌ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్‌ క్యాంప్‌ కార్యాలయంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్‌ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ నెల 13న తార్నాకలోని బ్రహ్మకుమారీస్‌ కార్యాలయంలో నిర్వహించతలపెట్టిన రక్షా బంధన్‌ వేడుకలకు రావాలనీ ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏబీవీపీ దీక్ష భగ్నం...విద్యార్థి నేతల అరెస్ట్‌

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట సోమవారం చేపట్టిన నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేసి విద్యార్థి నాయకులను అరెస్ట్‌ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వర్సిటీలకు వీసీలను నియమించాలని, టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ ఉద్యోగాలను భర్తీ చేయాలని, హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని, పెంచిన పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజును తగ్గించాలని, ఏబీవీపీ నాయకులు దీక్ష చేపట్టారు. దీక్షకు అనుమతి లేదని ఓయూ పోలీసులు ఏబీవీపీ నాయకులు అరెస్ట్‌ చేసి అంబర్‌పేట్‌ పీఎస్‌కు తరలించంగా పోలీసు స్టేషన్‌ (పీఎస్‌) కూడ దీక్ష చేపట్టినట్లు విద్యార్థి నేతలు చెప్పారు. వర్సిటీల సమస్యల పై శాంతియుతంగా దీక్ష చేస్తున్న విద్యార్థులను అరెస్ట్‌ చేయడం దారుణమని ఏబీవీపీ నాయకులు రాజు, పృథ్వీ పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ పద్మారావునగర్‌ పార్కులో ఉచిత ఈఎన్‌టీ, దంత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్ద ఎత్తున వాకర్స్‌ సందర్శకులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను అందజేశారు. డాక్టర్‌ జోష్న ఇఎన్‌టీ సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రి అధ్వర్యంలో వాకర్స్‌ అసోసియేషన్‌ సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జోష్న ఇఎన్‌టీ సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్‌ జోష్నశ్రీ అనిశెట్టి, డాక్టర్‌ సాయికుమార్‌, డాక్టర్‌ సాన, డాక్టర్‌ మణికంఠ, గౌతమీ, దీపా, జ్యోతి, నజ్మ, పద్మారావునగర్‌ పార్కు వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

రసూల్‌పురా: బొల్లారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డౌటన్‌బజార్‌ రీడింగ్‌ హాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, సీజనల్‌ జ్వరాలు, బీపీ, షుగర్‌, దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం ఉచితంగా మందులను పంపిణీ జేశారు. శిబిరం నిర్వాహకులు డాక్టర్‌ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాఖ ఆదేశాల మేరకు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్‌ నాయకులు బాల్‌రాజు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణమాదిగకు ఘన స్వాగతం

సికింద్రాబాద్‌: మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ద్వారా సాధించి ఢిల్లీ నుండి నగరానికి మంగళవారం వస్తున్న ఎంఆర్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు ఘన స్వాగతం పలుకనున్నట్లు ఎమ్మార్పీఎస్‌ జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్‌ మాదిగలు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగకు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలుకుతామన్నారు. ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ కు కృష్ణ మాదిగ చేరుకుంటారని తెలిపారు. స్టేషన్‌ నుండి రాష్ట్రపతి రోడ్డు, ట్యాంక్‌ బండ్‌ మీదుగా ఎల్బీ స్టేడియం ముందు ఉన్న బాబు జగ్జీవన్‌ రామ్‌ గారి విగ్రహం వద్దకు స్వాగత ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

అన్నానగర్‌లో ‘రంగం’


భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి శోభరాణి

రసూల్‌పురా: కంటోన్మెంట్‌ అన్నానగర్‌ బోనాల జాతరలో భాగంగా రెండోరోజు సోమవారం పోచమ్మ ఆలయంలో రంగం కార్యక్రమం నిర్వహించారు. మారేడుపల్లికి చెందిన మాతంగి శోభారాణి పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపించారు. అన్నానగర్‌ ప్రాంతంలో తమ ఏడుగురు అక్కా చెల్లెళ్లు కొలువై ఉండి ప్రజలను కాపాడుతున్నా మని అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దేల యాదగిరి, పరిమళ్ల వెంకటేష్‌, సుంకన్న, కొరమీను శ్రీను, సుదర్శన్‌, మురళి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహార బండి ఊరేగింపు



లాలాపేట: శ్రావణ మాసం బోనాల వేడుకల్లో భాగంగా శాంతినగర్‌లోని భజరంగ్‌ యూత్‌ నల్లపోచమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మేయర్‌ బండ కార్తీకచంద్రారెడ్డి, సీతాఫల్‌మండి కార్పొరేటర్‌ సామల హేమ, మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రావణ్‌, బీజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

హత్య చేసి ‘అమరావతి’లో పరార్‌

- పథకం ప్రకారమే ఉపాధ్యాయుడి హత్య
- నిందితుడు గణేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట: ఉపాధ్యాయుడిని పథకం ప్రకారమే హత్యచేసి ఆపై అమరావతి రైలులో మహారాష్ట్రకు పరారైన నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు. ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు.

- కర్నూలు జిల్లా ఆలమూరుకు చెందిన ఎస్‌. వెంకటరమణ (38) అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని రవీంద్రభారతి స్కూల్లో ఆంగ్ల టీచర్‌గా పని చేస్తున్నాడు. ఎస్‌ఆర్‌నగర్‌లోని కాశీ విశ్వేశ్వరస్వామి బాయ్స్‌ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇదే గదిలో మరో ఇద్దరు యువకులు ఉంటున్నారు.
- ఏలూరు జిల్లా తంగెళ్లముడి చెందిన గణేష్‌ (27) ఇదే రూమ్‌లో దిగాడు. హాస్టల్‌ కింద రవి సెలూన్‌ షాపులో పనిచేసే గణేష్‌ ప్రతి రోజూ మద్యం తాగి ఆలస్యంగా రూమ్‌కు వచ్చి రూమ్‌ మేట్స్‌ను ఇబ్బందులకు గురి చేస్తూ గొడవ పడుతుండేవాడు.
- జులై 27న రాత్రి మద్యం మత్తులో తన స్నేహితుడితో కలిసి హాస్టల్‌కు వచ్చిన గణేష్‌ గది తలుపులను బలంగా తన్నడంతో రమణ లేచి రోజూ ఇదేం పనని ప్రశ్నించాడు. దీంతో తన వద్ద ఉన్న కత్తితో మెడ, శరీరంపై పొడిచాడు. తీవ్ర రక్త స్రావమై రమణ అక్కడికక్కడే మృతి చెందగా గణేష్‌ పరారయ్యాడు. ఈ కేసులో సోమవారం కూకట్‌పల్లి వైజంక్షన్‌ వద్ద అరెస్టు చేశారు.

అంతా ప్లాన్‌ ప్రకారమే..

పథకం ప్రకారమే ఉపాధ్యాయుడిని హత్య చేసినట్లు విచారణలో నిందితుడు వెల్లడించాడు. తనను ఎదిరిస్తున్నాడన్న కోపంతో రమణపై కక్ష పెంచుకున్నాడు. అతడిని ఎలాగైనా మట్టుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. సనత్‌నగర్‌లో కత్తి కొనుగోలు చేశాడు. గతనెల 27న రాత్రి తన స్నేహితుడితో కలిసి హాస్టల్‌కు వచ్చిన గణేష్‌ రమణతో గొడవ పెట్టుకున్నాడు. స్నేహితుడు వద్దని వారించినా వినిపించుకోకపోవడంతో అతడు వెళ్లి పోయాడు. గొడవ పెద్దది కావడంతో విషయాన్ని హాస్టల్‌ నిర్వాహకుడికి చెప్పేందుకు ఇద్దరు రూమ్‌మేట్స్‌ కిందకు వెళ్లగా రమణ ఒక్కడే ఉండిపోయాడు.దీన్ని అదునుగా చూసుకున్న గణేష్‌ తన వద్ద ఉన్న కత్తితో రమణను పొడిచి హత్య చేశాడు. అనంతరం నేరుగా కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో మహారాష్ట్ర పారిపోయాడు. తిరిగి నగరానికి రాగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టండి

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్‌ డివిజన్‌ అధ్యక్షుడు బండి అభిషేక్‌ కోరారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సికింద్రాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నిబంధనలను అతిక్రమించి బోర్‌వెల్స్‌, అక్రమ నిర్మాణాలు చేపడతున్నా సంబంధిత అధికారులు స్పందించడంలేదన్నారు.



జెడ్‌సీ రవికిరణ్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్‌ డివిజన్‌ అధ్యక్షులు

ముగిసిన బోనాల వేడుకలు

బన్సీలాల్‌పేట్‌: అమ్మవారి బోనాల వేడుకలు సోమవారం బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా ముగిశాయి. అమ్మవారి రంగం, గావు, జల్లికడవ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి అమ్మవారి జల్లికడవ ఊరేగింపు కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. బ్యాండ్‌ మేళాలు మధ్య జల్లికడవ కార్యక్రమం ఘనంగా జరిగింది. బన్సీలాల్‌పేట్‌, బోయిగూడ, గొల్లకొమురయ్య కాలనీ, రైల్‌ కళారంగ్‌ బస్తీ, చాచానెహ్రూనగర్‌, గాంధీనగర్‌, న్యూబోయిగూడ, ఐడిహెచ్‌ కాలనీ, బండ మైసమ్మ నగర్‌, సున్నంబట్టీ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల ముందు వందలాది మంది నృత్యాలు చేస్తూ బోనాల వేడుకలను ఆనందోత్సాహల మధ్య నిర్వహించుకోవడం కనిపించింది.

లోహియా నగర్‌లో ఘర్షణ

అడ్డగుట్ట: పాత కక్షల కారణంగా ఒకే బస్తీకి చెందిన రెండు వర్గాలు గొడవ పడడంతో పలువురికి గాయాలయ్యాయి. తుకారాంగేట్‌ ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ తెలిపిన మేరకు..లోహియా నగర్‌ ప్రాంతానికి చెందిన హరికృష్ణ(25) హరీష్‌(30) కుటుంబాల మధ్య కొంత కాలంగా పాతకక్షలు ఉన్నాయి. ఆదివారం బోనాల పండుగను పురస్కరించుకొని వేడుకలు జరుపుకుంటున్న సమయంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. దీంతో హరికృష్ణ కుటుంబసభ్యులు, హరీష్‌ కుటుంబసభ్యులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో పలువురికి స్వల్ప గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హరికృష్ణ, హరీష్‌లతో పాటు గొడవకు పాల్పడిన వారి కుటుంబసభ్యలపై కూడా కేసు నమోదు చేశారు.

మహిళా మోర్చా తిరంగా బైక్‌ ర్యాలీ


బైక్‌ ర్యాలీని ప్రారంభిస్తున్న మేకల సారంగపాణి

లాలాపేట: భారతీయ జనతా పార్టీ తలపెట్టిన హర్‌ ఘర్‌ తిరంగా అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహంకాళి సికింద్రాబాద్‌ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో తిరంగా బైక్‌ ర్యాలీ నిర్వహించారు. జిల్లా మహిళా మోర్చ ఆధ్యక్షురాలు అనిత ఆధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీని తార్నాక చౌరస్తాలో బీజేపి జిల్లా అధ్యక్షులు మేకల సారంగపాణితో కలిసి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియా గౌడ్‌,సుచిత్ర, దీపిక, మహిళా నాయకురాలు కీర్తిహర్ష, మేకల సుజాత పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులను వెంటనే పూర్తి చేయండి

రాంగోపాల్‌పేట: పెండింగ్‌ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అధికారులను ఆదేశించారు. రాంగోపాల్‌పేట డివిజన్‌ కళాసీగూడలో వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆయన పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాసీగూడ నాలా వెంట సీవరేజ్‌ పైప్‌లైన్‌ పనులు పూర్తి చేసి రోడ్డు నిర్మించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్‌, వాటర్‌వర్క్స్‌ జీఎం ఆశిష్‌ పాల్గొన్నారు.



సిల్క్‌ ఆఫ్‌ ఇండియా హ్యాండ్‌లూమ్‌ ఎక్స్‌పో ప్రారంభం

రసూల్‌పురా: చేనేత కళాకారులు తమ నైపుణ్యం ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉండేలా కృషి చేస్తున్నారని బిగ్‌బాస్‌ ఫేమ్‌, నటి అశ్విని శ్రీ పేర్కొన్నారు. కంటోన్మెంట్‌ క్లాసిక్‌ గార్డెన్‌లో సోమవారం సిల్క్‌ ఆఫ్‌ ఇండియా హ్యాండ్‌లూమ్‌ ఎక్స్‌పో-2024ను నిర్వాహకులు సోమనథ్‌ బౌమిక్‌, అభిజిత్‌ షాలతో కలసి అశ్విని శ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళాకారుల ప్రతిభకు ఎక్స్‌పో ఎంతో ఉపయోగ పడుతుందని నేరుగా నేత కార్మికులతో అనుసంధానం చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించే వేదిక అని అన్నారు. నిర్వాహకులు సోమనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘మహాయజ్ఞం’లో పాల్గొన్న బీజేపీ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న మాధవీలత

పద్మారావునగర్‌: ఆలోచనలతో కూడిన సనాతన ధర్మమే...హైదవ ధర్మమని బీజేపీ నాయకురాలు మాధవీలత అభివర్ణించారు. సికింద్రాబాద్‌ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ స్కంద గిరి సుబ్రమణ్యం స్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీ విద్యాకోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమానికి సోమవారం హాజరై మాట్లాడారు. సకల బాధ్యతలను నిర్వర్తిస్తున్న నారీ మహానుబాహురాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ ఈటేల రాజేందర్‌, యువ చేతన జాతీయ సమన్వయకర్త రోహిత్‌ కుమార్‌ సింగ్‌, ఎమ్మెల్యే రాకేష్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థుల నిరసన

అమీర్‌పేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సనత్‌నగర్‌ ఈఎస్‌ఐసీ మెడికల్‌ కళాశాలలో వైద్య విద్యార్థులు నిరసన చేపట్టారు. కళాశాల ప్రధాన గేటు వద్ద ప్లకార్డులు చేత పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసేందుకు ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టును ఏర్పాటు చేసి బాధ్యులైన దోషులకు మరణ శిక్ష పడేలా చూడాలని బెంగాల్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: టమాటా కిలో రూ.23, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 45, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్‌ 50, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 25, క్యారెట్‌ 40, దొండ 28, గుండుబీన్స్‌ 50, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్‌ 28, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విద్యతోనే సమాజ వికాసం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌..


చిల్డ్రన్స్‌ పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

సనత్‌నగర్‌: మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు ఆశయాలకు అనుగుణంగా విద్యనందిస్తున్న శ్రీరామానందతీర్థ మెమోరియల్‌ స్కూల్‌ అభివృద్ధికి అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలను అందిస్తానని మాజీ మంత్రి సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ ప్రకటించారు. బేగంపేట బ్రాహ్మణవాడీలోని శ్రీరామానందతీర్థ మెమోరియల్‌ స్కూల్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్‌ పార్కును సోమవారం ఆయన ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి ప్రారంభించారు. ముందుగా స్కూల్‌ ప్రాంగణంలోని మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్డ్రన్స్‌ పార్కును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే సమాజ వికాసం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ టి.మహేశ్వరి, మెమోరియల్‌ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌, సురభి రెనవబుల్‌ ఎనర్జీ డైరెక్టర్‌ శేఖర్‌ మారం రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


మైలార్‌గడ్డ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌ మైలార్‌గడ్డ సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్‌ సామల హేమ, పలువురు బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో నామాలగుండు నుంచి మైలార్‌గడ్డ మీదుగా చిలకలగూడకు వెళ్లే మార్గం నెల రోజుల పాటు అందుబాటులో ఉండదని, నామాలగుండు నుంచి సీతాఫల్‌మండి చౌరస్తా మీదుగా చిలకలగూడకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

ఓయూ కామర్స్‌ హెడ్‌గా ప్రొ.గంగాధర్‌

స్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్‌ విభాగం హెడ్‌గా ప్రొ.గంగాధర్‌ నియమితులయ్యారు. ఇంతకాలం హెడ్‌గా కొనసాగిన ప్రొ.చెన్నప్ప పదవీ కాలం ముగియడంతో సోమవారం ప్రొ.గంగాధర్‌ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగనున్నారు.

ఏఎస్‌ఐ శ్యామలను అభినందించిన ఎమ్మెల్యే

సనత్‌నగర్‌: అథ్లెటిక్స్‌లో మెడల్‌ సాధించిన ట్రాఫిక్‌ ఏఎస్‌ఐ శ్యామలను సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అభినందించారు. సైఫాబాద్‌లో ట్రాఫిక్‌ ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్యామల గత నెల 12 నుంచి 24వ తేదీ వరకు అమెరికాలోని క్లీన్‌ల్యాండ్‌ ఓహియోలో ప్యాన్‌ అమెరికన్‌ మాస్టర్స్‌ గేమ్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భారత్‌ తరుపున పాల్గొన్న శ్యామల బ్రాంజ్‌ మెడల్‌ను గెలుచుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తాను గెలుచుకున్న బ్రాంజ్‌ మెడల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని గెలుచుకున్న అవార్డులు, పతకాలను చూపించి వాటి గురించి వివరించారు.


శ్యామలను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌.

ఓయూలో ఘనంగా ఏఐఎస్‌ఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం


ఏఐఎస్‌ఎఫ్‌ జెండాను ఎగురవేస్తున్న ఎల్లేష్‌

ఉస్మానియా యూనివర్సిటీ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్‌) 89వ సంవత్సరంలోకి అడుగిడుతోందని మాజీ విద్యార్థి నేత, ఓయూ విశ్రాంత జాయింట్‌ రిజిస్ట్రార్‌ ఉప్పరి ఎల్లేష్‌ అన్నారు. సోమవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏఐఎస్‌ఎఫ్‌ 89వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శి ఆరెకంటి భగత్‌ పాల్గొన్నారు.

ఓయూ లఘుచిత్రం అవార్డుకు ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ-సీఈసీ 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్‌ ఫెస్టివల్‌ పోటీల్లో ఓయూ ఈఎంఆర్‌సీ (ఎడ్యుకేషనల్‌ మల్టీ మీడియా రీసెర్చ్‌ సెంటర్‌) అవార్డుకు ఎంపికైనట్లు సోమవారం అధికారులు తెలిపారు. యూజీసీ-సీఈసీ ప్రతి ఏటా పర్యావరణం, అభివృద్ధి, మానవ హక్కులు, స్వచ్ఛ భారత్‌ విభాగాలలో లఘు చిత్రాల పోటీలను నిర్వహిస్తారు. ఈఎంఆర్‌సీ డైరెక్టర్‌ పి.రఘుపతి నేతృత్వంలో ఓయూ జర్నలిజం విద్యార్థులు సంతోష్‌, ఇస్రంలు ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి విద్యార్థులకు విద్యతో పాటు ఇతర అంశాలలో బోధనకు వలంటీర్లు చేస్తున్న కృషిని రీచింగ్‌ ద అన్‌రీచ్డ్‌ అనే పేరుతో లఘు చిత్రాన్ని నిర్మించారు. త్వరలో జరగనున్న ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్‌ ఫెస్టివల్‌ కార్యక్రమంలో ఈఎంఆర్‌సీ డైరెక్టర్‌ రఘుపతి అవార్డును అందుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రఘుపతిని పలువురు ఓయూ అధికారులు అభినందించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

సికింద్రాబాద్‌: మృతి చెందిన రైల్వే కుటుంబాలకు దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్‌ క్రెడిట్‌ సొసైటీ ద్వారా తక్షణ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి తెలిపారు. సోమవారం మెట్టుగూడ వర్క్‌షాప్‌లో టెక్నీషియన్‌ కె.సాయిప్రసాద్‌ ఇటీవల మృతి చెందాడు. సొసైటీ నుంచి రూ.5 లక్షల సొసైటీ వాటాధనాన్ని సాయిప్రసాద్‌ భార్య హంసవేణికి చిలుకు స్వామి అందించారు. రైల్వే ఉద్యోగులు మృతి చెందిన సందర్భాల్లో తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేయడంతోపాటు వాటాధనాన్ని సకాలంలో అందిస్తున్నామని చెప్పారు. వర్క్‌షాప్‌ డివిజనల్‌ సెక్రటరీ బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు నవీన్‌, నాయకులు బాలకృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు కుమార్‌, రాజేందర్‌, రమాదేవి, నాయక్‌ పాల్గొన్నారు.

మజ్దూర్‌ యూనియన్‌ నిరసన ప్రదర్శనలు

సికింద్రాబాద్‌: రైల్వేద్యోగులకు 18 నెలల డీఏ బకాయిలు చెల్లించాలని, నూతన పెన్షన్‌ విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు యూనియన్‌ నాయకులు అన్ని రైల్వే కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పే కమిషన్‌ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్‌ చేస్తూ సికింద్రాబాద్‌ డివిజనల్‌ కార్యాలయం, బోయగూడ ఐఓహెచ్‌ షెడ్డులో మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. సికింద్రాబాద్‌ బ్రాంచ్‌ సెక్రెటరీ జి.శీనయ్య, ఎలక్ట్రికల్‌ బ్రాంచ్‌ కార్యదర్శి వినాయక రావు తదితరులు పాల్గొన్నారు.